# 73. ప్రలోభ పురాణం

"మీ కంపెనీ వాచీలు ఇంత చవగ్గా ఇచ్చేస్తున్నారు కదా; మీకు వ్యాపారం ఎలా కిట్టుబాటవుతుందండీ?" అని వెనకెప్పుడో ఒక వాచీల కంపెనీ ప్రొడక్షన్-కమ్-సేల్సు మేనేజర్ని ఒక శ్రేయోభిలాషి అడిగేడట. శ్రేయోభిలాషి కొశ్చన్‌లో ఆశ్చర్యమూ మెచ్చుకోలూ కలిసి ఉన్నట్టు తెలిసి ఆ మేనేజరుకి నిజం చెప్పేసే టెంప్టేషను (ప్రలోభం) కలిగిందిట. "ఏముందీ? మా కంపెనీకి ప్రతి ఊళ్లోనూ ఉన్న సేల్సు బ్రాంచీల్లో రిపేరుసెక్షన్లు ఎటాచిడు బాత్రూములల్లా ఉన్నాయి. వాటి ద్వారా ఈ నష్టాలు పూడుకుపోతాయి" అని వచ్చిందట జవాబు.

చెప్తే నమ్మరు గాని మా ఊళ్లో ఒక టెంప్టేషను ఎపిసోడు (ప్రలోభ ఉదంతం) నిజంగా జరిగింది. మా ఊళ్లో పారిశ్రామిక నగరానికీ జనావాస నగరానికీ మధ్య ఉన్న నాలుగు కిలోమీటర్ల నిర్మానుష్య రోడ్డుకి ఈ చివరా ఆ చివరా రెండు సైకిల్-కమ్-స్కూటర్ రిపేరు షాపులు ఉన్నాయి. రెండు చోట్లా కూడా పంచర్లు వేసి గాలి కొట్టడానికి అవసరమైన యంత్రాంగం కూడా (మళ్లీ ఎటాచిడు బాత్‌రూం సామ్యంలోనే) ఉన్నాయి. నా క్లాస్మేటూ ఉత్తరోత్రా నాకు జూనియరూ అయిన వెంకటరెడ్డి మా వూరికి పోలీసు సర్కిలినస్పెక్టరుగా వచ్చేవరకు ఈ రెండు టూ వీలర్ రిపేరు షాపుల కిటుకు నాకు తెలియలేదు. ఒక సారి నేను అతన్ని కలుద్దామని వెళ్లేసరికి అతను సుమారు పాతికేళ్ల వయసున్న ఒక యువకుణ్ణి 'ఇంటరాగేషన్' చేస్తున్నాడు. (ఇంటరాగేషన్ అంటే తెలుసుగా : "దండం దశగుణం భవేత్"లో ఒక గుణం చూపిస్తున్నాడు). నాకు అతని దండం (లాఠీ కర్ర) తో ఏమీ అవసరం లేదు గాబట్టి "పెన్ని గారూ, మీ అప్పడాల కర్ర ఒకసారి-" అని మొదలెట్టి "సర్లెండి మీ పని కాంగానే వస్తాను" అనే పక్కింటమ్మాయిలా వెళ్లిపోకుండా అక్కడే కూచున్నాను. అందువల్ల తెలిసిన సంగతేమిటంటేనూ, ఆ అబ్బాయే ఈ రెండు రిపేరు షాపులకీ వోనరనీ, తెల్లారగట్టే లేచి ఆ నాలుగు కిలోమీటర్ల రోడ్డులో ఎక్కడో తనకి తోచిన చోట్ల కొంచెం ఎద్దు నాడులూ, ఐదో ఆరో డ్రాయింగు పిన్నులూ, స్క్రూలు ఇలాంటివి వేరుసెనగ గింజల్లా జల్లుతాడట. అంతే, రాత్రి షిఫ్ట్ నుంచి వచ్చే వాళ్లు ఈ చివరున్న షాపులోనూ, ఉదయం షిఫ్ట్‌కి వచ్చే వాళ్లు ఆ షాపులోనూ రిపేర్లు చేయించుకుంటారుట.

హాస్య బ్రహ్మగా తెలుగు సాహిత్యంలో పేరు పొందిన భమిడిపాటి కామేశ్వరరావుగారిది ఒక జోకు పొడిగిస్తే ఒక ప్రలోభ ఉదంతం అవుతుంది. ఒక మేష్టారు క్లాస్ రూముకి వచ్చే సరికి ఓ కుర్రాడు ఇంకో కుర్రాడిమీద చేసిన కంప్లేంటు సంగతి ముందు చూడవలసి వచ్చిందిట.

"మేష్టారండీ, సుబ్బారావండీ, నన్ను వీపు మీద తన్నేడండి. అందరూ చూసేరండి. కావాలంటే అడగండి."

"ఏరా సుబ్బారావు, వాణ్ణి వీపు మీద ఎందుకు తన్నేవు?"

"వాడిదే తప్పండి, మేష్టారండి. నేనసలు వాణ్ణి డొక్కలో (కడుపు మీద) తన్నవలసిందండి. వాడేమోనండి, సడన్‌గా వెనక్కి తిరిగిపోయేడండి!"

అదంతా పక్కన పెట్టి పాఠం చెప్పే ధోరణిలో అడిగాడట : " అసలు మనకి దేవుడు కాళ్లెందుకిచ్చేడు, చెప్పు, నర్సింగరావ్!"

"అవసరం ఒచ్చినప్పుడు ఎవర్నయినా తన్నడానికండి."

"ఓరి వెధవా, అదా సమాధానం? రామకృష్ణా, నువ్వు చెప్పు!"

"మరే, గాజు పెంకు, ముల్లు ఇలాంటి వేవయినా దిగితే తీసుకోడానికండి."

"చిఛీ, మీకందరికీ మతులు పోతున్నాయి. ఏదీ, నారాయణ మూర్తీ, నువ్వు చెప్పూ!"

"ఏదైనా తొక్కితేనండి, కడుక్కోడానికండి."

మేష్టారికి చిరాకేసి నెత్తి కొట్టుకునే ప్రలోభం కలగ్గా దానికి లొంగిపోయీ కూడా "నడవడానికని ఒక్క వెధవా చెప్పడేంరా?" అని కోప్పడే ప్రలోభాన్ని ఆపుకున్నాడట. ఎందుకంటే, "మీరు చెపుతున్నారు కదండి!" అని ఏ వెధవయినా అనేస్తే?

"అడుసు తొక్కనేల, కాలు కడుగ నేల?" అనే నుడికారం ప్రలోభం ఆధారంగా ఏర్పడ్డదే. కాని అడుసు తొక్కవలసిందే, కాలు కడగవలసిందే - అని జీవితం చెప్తుంది. మన చుట్టూ ఉన్న మనుషులకీ పరిస్థితులకీ మనచేత అడుసు తొక్కించడమే పని. మా ఊళ్లో కొన్ని రోడ్లకి వన్-వే-ట్రాఫిక్ నిబంధన ఉంది. కాని వన్‌వే ప్రారంభం అయిన దగ్గిర "నో ఎంట్రీ" అనే బోర్డుండదు. చివర మాత్రం ఒక పెద్ద పోలీసూ, ఒక చిన్న పోలీసూ నిలబడి కేసులు బుక్ చేస్తారు. ఇలా వెళితే దగ్గర కదా - అన్న ప్రలోభంలో పడిన వాళ్లందరూ ఆస్కారువైల్డు సూక్తి పరిధిలోకి వెళ్లిపోతారు. "ఐ కెన్ రెసిస్ట్ ఎనిథింగ్ బట్ టెంప్టేషన్" (ప్రలోభాన్ని తప్ప దేన్నయినా తట్టుకోగలను!) కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలు అదేపనిగా మనిషిని ప్రలోభపెడతాయి. పాపం, మనిషి ఎంతకని చస్తాడు!

కిందటి శనివారం నాడు జగదీశ్వర్రావుకి ఒక చిత్రమైన అనుభవం అయింది. ఈ వైపున ఒకటీ, ఆ వైపున ఒకటీ రెండు దంతాలు కదుల్తున్నాయని. వాళ్ల కంపెనీ ఆస్పత్రికి విజిటింగ్ డెంటల్ సర్జన్‌గా వచ్చే వసంతరాయుడు గారికి చూపించేడు. "నొప్పి రెండు వారాలుగా ఉందండి. పని వొత్తిడి వల్ల రాలేకపోయానండి. బాగా ముదరబెట్టేసి మీకు శ్రమ ఇస్తున్నానేమో."

"అదంతా ఎందుకులెండి. ఈ రెండు దంతాలూ తీసేస్తాను." అని ఇగుళ్లలో ఇంజెక్షనిచ్చి ఐదు నిమిషాల్లో పీకి పారేశాడు.

"మరీ వీటికి బదులు రెండు దంతాలు కట్టరా?" అన్నాడు జగదీశ్వరరావు.

"ఆ ఏర్పాటు మీ కంపెనీ ఆస్పత్రిలో లేదు. సాయంకాలం నా క్లినిక్కిరండి."

ఆ సాయంకాలం ఆ పళ్ల డాక్టరు దగ్గిరికి వెళ్లగా, అక్కడ: ఆయన వారంలో ఒక్కొక్క రోజు ఒకటిగా విజిటింగు చేస్తున్న ఆసుపత్రులు గల కంపెనీల ఉద్యోగులు - పళ్లు కట్టించుకునే నిమిత్తం క్యూలు కట్టించుకుని ఉన్నారు.

"మన కంపెనీ ఈయనికి కన్సల్టింగు ఫీజుగా నెలకి ఐదొందలిస్తాది. అలాగే ఆరు కంపెనీలు ఆరైదొందల్లు అంటే మూడు వేలిస్తాయి. గానీ, ఈన అక్కడ పళ్లు ఊడదీసి నోళ్లందరికీ ఇక్కడ పళ్లు గట్టాడు గదా. ఇక్కడ వారానికి మూడు వేలు గిడతై" అని ఒకాయన విశ్లేషణాత్మకంగా వివరించాడు.

"మాయురె! ఇతడు దంత వైద్యుడా. లేక పళ్ల వ్యాపారియా?" అని అచ్చెరువంది జగదీశ్వరరావీ(యు) "దంతము" ను జెప్పుటకు నాకడ కేతెంచెను! "అతడు నేత్ర వైద్యుడు కానందులకు సంతోషింపవలసియున్నది" అని నేనంటిని.

★